**COMMUNIST PARTY OF INDIA (MARXIST)**

**ANDHRA PRADESH COMMITTEE**

H.No. 27-30-9, CPI(M) State Committee Office
AKulavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: apcpim@gmail.com

**ప్రచురణార్థం/ప్రసారార్థం :** **విజయవాడ,**

**తేది : 07 జూలై, 2023.**

## చిన్న పరిశ్రమలపై విద్యుత్ భారాలు ఉపసంహరించాలి

రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ భారాలు తగ్గించి మూతపడుతున్న చిన్న పరిశ్రమలను ఆదుకోవాలని సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేస్తున్నది.

విద్యుత్ టారిఫ్‌ల పెంపుతో విద్యుత్ భారాన్ని మోయలేక ఫెర్రోఎల్లాయిస్ పరిశ్రమలను తాత్కాలికంగా మూసివేస్తున్నారు. ఫెర్రో ఎల్లాయ్ పరిశ్రమలకు ప్రధాన వనరు విద్యుత్తే. ఈ వారంలోనే రెండు ఫెర్రో ఎల్లాయీస్ పరిశ్రమలు (ఫేసర్, డెక్కన్ ఫెర్రో ఎల్లాయిస్) లాకౌట్ ప్రకటించాయి. గత సంవత్సరంతో పోలిస్తే 72% ట్రూఅప్ ఛార్జీలు, ఇంధన సర్దుబాటు ఛార్జీలు పెరిగాయి. ఎలక్ట్రిసిటీ డ్యూటీ యూనిట్‌కు 6 పైసలు నుండి రూపాయికి పెంచారు. లెవీ యూనిట్‌కు 85 పైసలు అదనంగా వడ్డించారు. దీనివల్ల ఇప్పటివరకు ఉన్న విద్యుత్ ఛార్జీలు యూనిట్ రు.5 నుండి రు.8.59కి పెరిగింది. ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు తగ్గిస్తేనే తిరిగి నడపగలమని జిల్లా కలెక్టరు, సంబంధిత ప్రభుత్వ శాఖలకు లేఖలు వ్రాశాయి. ఇప్పుడు విద్యుత్ భారాలతో రాష్ట్రంలో మొత్తం 39 ఫెర్రోఎల్లాయిస్ పరిశ్రమలు మూతపడనున్నట్లు వార్తలు వస్తున్నాయి. అందులో ఒక్క విజయనగరంలోనే 16 పరిశ్రమలు ఉన్నాయి. వెనుకబడిన విజయనగరం జిల్లాలోనే గతంలో జ్యూట్ పరిశ్రమ, నేడు ఫెర్రోఎల్లాయిస్ పరిశ్రమ మూతపడడంతో పారిశ్రామికంగా జిల్లా పూర్తిగా వెనుకబడుతుంది. ఈ ఒక్క పరిశ్రమలోనే 30 వేలమంది కార్మికులు రోడ్డున పడతారు.

ఇవే కాక ఇతర చిన్నతరహా పరిశ్రమలకు కూడా పెరిగిన విద్యుత్, ట్రూఅప్ భారాలతో విద్యుత్ ఖర్చు రెట్టింపు అవుతున్నది. 2019కి ముందు యూనిట్‌కు రు.4.95 ఉన్న ధర ఇప్పుడు రు.7.40 అయ్యింది. ట్రూఅప్ ఛార్జీలు వంటివికూడా కలిపితే ఇంకా పెరుగుతున్నది. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే విద్యుత్ ఛార్జీలు చాలా ఎక్కువగా ఉండడంతో మన రాష్ట్రంలోని చిన్న పరిశ్రమలు నడపలేక మూతపడాల్సిన దుస్థితి వస్తున్నది. ఈ పరిశ్రమలు మూతపడడం వలన ఆ పరిశ్రమలలో పనిచేస్తున్న కార్మికుల జీవన భృతి దెబ్బతింటుంది. అనుబంధ పరిశ్రమలు కూడా మూతపడి కార్మికులు రోడ్డున పడతారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ఆదుకుంటున్నామని ప్రచారం చేసుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం ఆచరణలో విద్యుత్ ఛార్జీలు పెంచి మూతపడడానికి దోహదం చేస్తున్నది. ఇదే పరిస్థితి కొనసాగితే రాష్ట్రం తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొనవలసి వస్తుంది.

రాష్ట్ర ప్రభుత్వం మేల్కొని రానున్న సంక్షోభాన్ని నివారించడానికి పరిశ్రమలకు చేయూతనిచ్చి ఆదుకోవాలి. చిన్న పరిశ్రమలకు విద్యుత్ సబ్సిడీ ఇవ్వాలి. పరిశ్రమల మనుగడను కాపాడి తద్వారా ఉపాధి కోల్పోకుండా నివారించాలని సిపిఐ(ఎం) కోరుతున్నది.

**(వి.శ్రీనివాసరావు)**
రాష్ట్ర కార్యదర్శి